



మండలూరులో ఎండిపోతున్న శనగపంట

గంగ పారదు.. పంట అందదు

- 500 ఎకరాల్లో ఎండిన శనగ, జొన్న పంటలు
- రూ.1.60 కోట్ల పెట్టుబడి మట్టిపాలు
- ఆందోళనలో రైతులు

రుద్రవరం, జనవరి 23:
ఆకాశం కురవదు.. వాగు పారదు.. సాగు చేసిన పంట చేతికి వస్తుందో లేదో తెలియదు.. మండలంలోని మందలూరు, చిలకలూరు, చందలూరు గ్రామాల రైతులకు దిక్కుతోచడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన శనగ, జొన్న పంటలు ఇప్పటికే 500 ఎకరాల దాకా ఎండిపోయాయి. చేతికి వచ్చిన చోట కూడా అరకొర దిగుబడే. ఎకరాకు శనగలు రెండు క్వింటాళ్లే వచ్చాయి. జొన్నలు కూడా1 నుంచి 2 క్వింటాళ్లు మించలేదు. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



చిలకలూరు సమీపంలో ఎండిపోయిన జొన్న

కళ్లెదుటే ఎండిన పంటలు

వర్షం కురవక, తెలుగుగంగ నుంచి సాగునీరందక కళ్లెదుటే 500 ఎకరాల్లో పంటలు నిలువునా ఎండిపోయి దిగుబడి తగ్గిపోయింది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయం చేయడానికి మనసు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తగ్గిన దిగుబడి ఇలా..

శనగపంట దిగుబడి 8 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 2 క్వింటాళ్లకే పరిమితమైంది. జొన్న పంట 20 నుంచి 25 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 1 నుంచి 2 క్వింటాళ్లకే తగ్గింది. తెలుగుగంగ నుంచి సాగునీరందకపోవడం ప్రధాన కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 300 ఎకరాల్లో జొన్న, 200 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశారు. 200 ఎకరాలకు పప్పుశనగకు రూ.70లక్షలు, 300 ఎకరాల జొన్నకు రూ.90లక్షలు పెట్టిన పెట్టుబడి పుడమిపాలైందని రైతులు కన్నీరు పెట్టుకున్నారు.

కౌలు రైతుల దుస్థితి..

పెట్టుబడి పప్పుశనగకు ఎకరాకు రూ.14వేలు కౌలు, 25వేలు, జొన్నకు ఎకరాకు రూ.14వేలు కౌలు, రూ.25వేలు పెట్టుబడి పెట్టామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందకపోవడంతో పంట చేతికి వచ్చేలా లేదని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు.



నీరు లేని గంగ కాలువ

నాలుగు ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా



పప్పు శనగ నాలుగు ఎకరాల్లో సాగు చేశా. నీరు లేక పంట నిలువునా ఎండిపోతోంది. పొలం వద్దకు వెళితే కన్నీళ్లు వస్తున్నాయి. సాగు కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

- హసన్, రైతు, మందలూరు

ఒక్కతడి నీరు పారించా



11 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశా. ఒక్క తడి నీరు పారించినందుకు రూ.1.30లక్షలు ఖర్చు అయింది. 2 కిమీ మేర ప్లాస్టిక్ పైపు ఏర్పాటు చేసుకుని నీరు పారించా.. రెండో తడికి చేతకాకపోవడంతో వదిలేశా.

-చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, మందలూరు

పైర్లు ఎండిపోయాయి



కాల్వనీరు అందక పది ఎకరాల్లో జొన్న, శనగ పంట ఎండిపోయింది. పెట్టుబడి చేతికందే పరిస్థితి లేదు. దిగుబడి పూర్తిగా తగ్గింది. సాగునీరు అంది ఉంటే దిగుబడి బాగుండేది.

-పుల్లారెడ్డి, రైతు, మందలూరు

పది ఎకరాల్లో పంట ఎండిపోయింది



పది ఎకరాల్లో శనగపంట సాగు చేశా. సాగునీరందక, వర్షం కురవక నిలువునా పంట ఎండిపోయింది. పెట్టుబడి అంతా నేలపాలైంది. అప్పులు ఎలా తీర్చాలో..

-పెద్దిరెడ్డి, రైతు, మందలూరు

వైసీపీ పాలనలో ప్రజల పరిస్థితి దయనీయం

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



రుద్రవరం, జనవరి 23: వైసీపీ పాలనలో ప్రజల పరిస్థితి దయనీయంగా తయారైందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని యల్లావత్తుల గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో పాల్గొని ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు 42 రోజులకుపైబడి శాంతియుతంగా సమ్మె చేస్తే వారిని బెదిరించి లాఠీచార్జి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. విధుల్లో చేరకుంటే తొలగిస్తామని చెప్పడం వైసీపీ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సమ్మె చేస్తున్నవారితో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలే కానీ ఇలా చేయడం భావ్యమా అని విమర్శించారు. శిరివెళ్ల మండలం జీనపల్లెలో ఓ మహిళ మద్యంతో కుటుంబాలు సర్వనాశనమవుతున్నాయని ఆమెతో మొరపెట్టుకున్నారని అన్నారు. కల్తీ మద్యం అమ్మడమే మద్యపాన నిషేధమా ప్రశ్నించారు. అన్ని నియోజకవర్గాల్లోని ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధగా ఉన్నారన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాబు వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు మారుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమోహన్, మాజీ సర్పంచ్ ఎర్రం ప్రతాప్‌రెడ్డి, అల్లాడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో వలంటీర్ మోసం

ఒక్కొక్కరి నుంచి రూ.1.30 లక్షలు

పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నిరుద్యోగులు

చాగలమర్రి, జనవరి 23: చాగలమర్రి మండలంలోని ఓ మహిళా వలంటీర్ ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువకులను బురిడీ కొట్టించిన ఘటన వెలుగు చూసింది. మహిళా వలంటీర్‌గా నిర్వహిస్తూ పట్టణంలోని పలువురికి ఉన్నత పాఠశాలల్లో అటెండర్‌గా ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.1.30 లక్షల ప్రకారం వసూలు చేసింది. కాస్ ఫౌండేషన్ కింద ఉద్యోగాలు వచ్చినట్లు ధృవపత్రాలు కూడా తెప్పించింది. చాగలమర్రికి చెందిన ముగ్గురు, కడప జిల్లా ఇడమడకకు చెందిన మరో ఇద్దరు రూ.1.30 లక్షల ప్రకారం డబ్బులు చెల్లించి గత ఏడాది జూన్, జూలై నెలల్లో విధుల్లో చేరారు. చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, చింతల చెరువు ఉన్నత పాఠశాల, మద్దూరు, పెద్దబోదనం గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో అటెండర్లుగా ఉద్యోగాల్లో చేరారు. నాలుగు నెలలైనా జీతాలు రాకపోయేసరికి మోసపోయామని తెలుసుకున్నారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆయా పాఠశాలల హెచ్ఎంలు జిల్లా నుంచి ఉద్యోగాలకు సంబంధించిన ఉత్తర్వులు రాకపోయినా వీరిని ఎలా విధుల్లోకి చేర్చుకున్నారన్నది చర్చనీయాంశంగా మారింది.

జేఈఈ మెయిన్-1 పరీక్షలకు సర్వం సిద్ధం

నేడు బీ ఆర్క్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 23: దేశంలోని ప్రఖ్యాత విద్యాసంస్థలలో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్ ఫేస్-1 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష బుధవారం నుంచి ఫిబ్రవరి 1 వరకు కొనసాగుతుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. 24న మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు బీ ఆర్క్ కోర్సు పరీక్ష జరుగనున్నది. ఈ కోర్సుకు సంబంధించి విద్యార్థులకు అడ్మిట్ కార్డులను విడుదల చేశారు. కర్నూలులోని చెక్‌పోస్టు దగ్గర ఉన్న సనత్‌నగర్‌లోని అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 1వ తేది వరకు బీటెక్, బీఈ కోర్సులకు అన్‌లైన్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయి. కర్నూలు జిల్లా నుంచి దాదాపు ఆరు వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. తర్వాత మెయిన్ సెషన్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత సాధిస్తారు.

యువత.. బైక్‌ల మోత

- సైలెన్సర్లు తీసేసి రైడింగ్
- చెవులకు చిల్లులు పడేలా శబ్దం
- మితిమీరిన వేగంతో జనాలు బెంబేలు

నంద్యాల క్రైం, జనవరి 23: నంద్యాల పట్టణంలో కొందరు పోకిరీలు మోటార్‌బైక్‌ల శబ్దంతో మోత మోగిస్తున్నారు. మోటార్ సైకిళ్లకు సైలెన్సర్లు తొలగించి చెవులు చిల్లులు పడే శబ్దం చేస్తున్నారు. మితిమీరిన వేగంతో పట్టణంలోని రోడ్లపై చక్కర్లు కొడుతూ జనాలను బెంబేలెత్తిస్తున్నారు. ప్రధాన రోడ్లతోపాటు చిన్న చిన్న వీధుల్లో కూడా ఇదే పరిస్థితి. దీంతో చిన్నారులు, వృద్ధులు హడలిపోతున్నారు. ముఖ్యంగా ఫైర్ ఆఫీస్ నుంచి పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డు, టూ టౌన్ మీదుగా గిరినాథ్ సెంటర్ రోడ్డు, ఎస్‌బీఐ కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీ, బైర్మల్ స్ట్రీట్, మెయిన్‌బజార్, సాయిబాబా నగర్, వీసీ కాలనీ, దేవనగర్, ప్రభుత్వ ఆస్పత్రి, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కొందరు పోకిరీలు మోటార్‌సైకిళ్లకు సైలెన్సర్లు తొలగించి రైడింగ్ చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఉన్నా నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌ల ముందే అధిక శబ్దం చేసుకుంటూ వెళుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బైక్‌లపై డబుల్, ట్రిబుల్ రైడింగ్ చేస్తూ ఈలలు, కేకలతో వెళుతూ పాదచారులను భయానికి గురి చేస్తున్నారని, ఇలాంటి వారిపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కర్నూలు నగరం తరహాలో వ్యవహరించాలి

కర్నూలు నగరంలో టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆస్పత్రి ముందు ఓ బైక్ అధిక శబ్దం చేస్తూ వెళ్లడంతో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడని ఆస్పత్రి నిర్వాహకులు చేసిన ఫిర్యాదుతో పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ట్రిపుల్ రైడింగ్, అధిక శబ్దాలతో సైలెన్సర్లు లేకుండా ఉన్న వాహనదారులను నిలిపివేసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 18 మంది వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించి వారందరినీ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఇకపై అధిక శబ్దాలు చేస్తూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. అదే తరహాలో నంద్యాల పట్టణంలో కూడా పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి సైలెన్సర్లు లేని మోటార్‌బైక్‌లను, నిబంధనలు ఉల్లంఘించే వారిని, అధిక వేగంతో వీధుల్లో రైడ్ చేసేవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నంద్యాల పట్టణంలో కూడా ప్రధాన రోడ్లు, వీధుల్లో అనేక ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయని.. వాహనాల అధిక శబ్దంతో అక్కడ చికిత్స పొందుతున్న వారికి కూడా తీవ్ర అసౌకర్యం కలుగుతోందని వారి బంధువులు, ఆస్పత్రి వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముమ్మర తనిఖీలు, దాడులు చేస్తున్న పోలీసులు సైలెన్సర్లు లేని మోటార్‌బైక్‌లపై కూడా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికలపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ



మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తున్న నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), జనవరి 23: ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో పోలింగ్ ప్రక్రియ ఈవీఎంల పనితీరు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఐటీ సంబంధిత అంశాలపై జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికల నిర్వహణ సమర్థతపై పూర్తి స్థాయి శిక్షణ పొంది అసెంబ్లీ నియోజకవర్గ, మండల స్థాయిల్లోని ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలని మాస్టర్ ట్రైనర్లను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం 2023వ సంవత్సరంలో జారీ చేసిన హ్యాండ్ బుక్స్ క్షుణ్ణంగా చదవడంతోపాటు శిక్షణా తరగతుల్లో పీపీటీ ద్వారా సూచించిన అంశాలను ఆకళింపు చేసుకొని ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోల్‌డే ఏర్పాట్లపై నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు, తదితరులు మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ అధికారులు, అన్ని కమిటీల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అరకొర వేతనాలు

- సమాన పనికి సమాన వేతనం ఏదీ..?
- ఆందోళనలో ఎస్ఎస్ఏ కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ ఉద్యోగులు



కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 23: సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆక్రందనాలు, ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టడం లేదు. ఉద్యోగ భద్రత లేక చాలీ చాలని వేతనాలతో అల్లాడుతున్నారు. అది కూడా ఇవి నాలుగైదు నెలలకొకసారి జీతాల గ్రాంటును విడుదల చేస్తుండటంతో కుటుంబాల భారాన్ని మోయలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అయినా ఆ ఉద్యోగుల ఆర్థనాదాలు ప్రభుత్వానికి వినిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అరకొర వేతనాలతో విధులు నిర్వహించలేమని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లా సమగ్రశిక్షలో అన్ని కేటగిరిలో కలిపి 1984 మంది పని చేస్తున్నారు. ఇందులో ఔట్‌సోర్సింగ్ కింద 595 మంది, కాంట్రాక్టు విధానంలో 1389 మంది పని చేస్తున్నారు. కేటగిరి వారీగా రూ.18,000 నుంచి రూ.32 వేల వరకు వేతనాలు ఉన్నాయి. దీర్ఘకాలంగా పని చేసినా గ్యారెంటీగా ఉద్యోగం ఉంటుందనే నమ్మకం లేదు. అధికారుల ఆగ్రహానికి గురైనా, లేదా అధికార ప్రజాప్రతినిధులకు కోపం వచ్చినా ఉద్యోగం ఊడుతుందన్న భయంతో పని చేయాల్సిన పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రాజెక్టులో ఒకే క్యాడర్ ఉద్యోగులకు రకరకాల వేతనాలు చెల్లిస్తున్నారు. ఎన్నికల ముందు పాదయాత్రలో సీఎం జగన్ మోహన్ రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్ ఇచ్చి జాబ్ గ్యారెంటీ ఇస్తామని మాయ మాటలు చెప్పి గద్దెనెక్కి తర్వాత వాగ్దానాలను మరిచారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.






ఎస్ఎస్ఏ ఉద్యోగుల మానవహారం (ఫైల్)

డిమాండ్లు ఇవే..

- సమగ్ర శిక్షలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి.
- ఉద్యోగులందరికీ హెచ్ఆర్‌పి పాలసీ అమలు చేయాలి
- ప్రస్తుత ఉన్న పార్ట్‌టైమ్ విధానాన్ని రద్దు చేసి వేతనాలు పెంచి ఫుల్‌టైమ్ కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలి.
- ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఫుల్‌టైమ్ కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చి జీతాలు పెంచి ఇవ్వాలి.
- రూ.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాచ్యుటీ కల్పించాలి. సామాజిక భద్రత పతకాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలి.
- ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62కు పెంచాలి. వేతనంతో కూడిన మెడికల్ లీవ్స్ మంజూరు చేయాలి.
- మరణించిన ఉద్యోగుల కుటుంబాలను కారుణ్య నియామకాలు చేపట్టి ఆదుకోవాలి. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్స్ మంజూరు చేయాలి.
- ఉద్యోగులందరికీ ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లించాలి.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జేఏసీ) కర్నూలు ఎస్ఎస్ఏలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ఒకే క్యాడర్‌లో పని చేసే వారికి రకరకాల వేతనాలు చెల్లించడం సరికాదు. కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేసి పార్ట్ టైమ్ ఎంప్లాయిస్‌ను ఫుల్‌టైమ్ కాంట్రాక్టులోకి మార్చి జీతాలు పెంచి ఇవ్వాలి. ఎన్నికల ముందు పాదయాత్రలో తమకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి.

- చంద్రశేఖర్ రాజు

ఉద్యోగ భద్రత కల్పించాలి



సమగ్ర శిక్షలో పని చేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి. పదవీ విరమణ వయస్సు 62కు పెంచాలి. ప్రభుత్వ ఉద్యోగులను బెనిఫిట్స్ వర్తింపజేయాలి. అరకొర వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక.. ఇటు విధులు నిర్వహించలేక సతమతమవుతున్నట్లు వివరించారు. ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి.

-రఫీ, జేఏసీ నాయకుడు

రాజకీయంగా లోకేశ్ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

జన్మదిన వేడుకల్లో బీటీ నాయుడు



లోకేశ్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 23: రానున్న రోజుల్లో యువ నేత నారా లోకేశ్ రాజకీయంగా ఉన్నత శిఖరాలను అధిష్టించాలని ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకల్లో భాగంగా నాయకులు కార్యకర్తలతో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. అంతక ముందు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అవినీతి పాలనపై లోకేశ్ అలుపెరగని పోరాటం కొనసాగిస్తున్నారని అన్నారు. సీఎం అవినీతి, అక్రమాలపై యువగళం పేరుతో రాష్ట్రంలో పాదయాత్ర గత ఏడాది జనవరి 27న కుప్పంలో ప్రారంభించి గాజువాక దాకా 97 రోజులు 3.132 కిమీ నడిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరయాదవ్, కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ భరత్, కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్, నాయకులు నంద్యాల నాగేంద్ర, కార్పొరేటర్ కురవ పరమేష్, పీజీ గోపినాథ్, సత్రం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలంతా టీడీపీకి మద్దతు

కర్నూలు(అర్బన్), జనవరి 23: నగరంలోని ముస్లింలంతా టీడీపీకి మద్దతు ఇస్తున్నారని కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని 6 వార్డులోని గరీబ్ నగర్లో ఇంతియాజ్, ఖరీముల్లా, నూర్‌లు వారి అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ఇప్పుడున్న నాయకులు ముస్లింను ఓట్ల కోసం వాడుకున్నారే తప్ప ముస్లింలకు మేలు చేయలేదన్నారు. నగరంలో గౌండ, సెంట్రింగ్, వెల్డింగ్ పనులు కల్పించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఇబ్రహీం, షాకీర్, ఫయాజ్, జాకీర్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విభజన అంశం కాంగ్రెస్‌పై రుద్దకండి

- అయోధ్య పేరుతో మోదీ రాజకీయం
- డీసీసీ అధ్యక్షుడు బాబురావు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 23: అన్ని పార్టీల సమ్మతితోనే ఆనాడు కాంగ్రెస్ రాష్ట్ర విభజన చేసిందని, దానికి కాంగ్రెస్‌ను బాధ్యురాలిని చేయవద్దని డీసీసీ అధ్యక్షుడు కే బాబురావు అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ ఎంపిక సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ రెండు పార్టీలు రాష్ట్రంలో అభివృద్ధిని విస్మరించి అప్పుల ఊబిలోకి నెట్టాయని అన్నారు. అనాడు రాష్ట విభజన కాంగ్రెస్‌తో కాకపోతే తామే చేస్తామని పోటీ పడి రాష్ట్రానికి ప్రత్యేక హోదా 15 సంవత్సరాలు కావాలని ఇప్పుడు అన్యాయం చేసిందని అన్నారు. అయోధ్యలో రామ్‌లాల్ ప్రాణప్రతిష్ఠ పేరుతో మోదీ మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 52 మందితో కాంగ్రెస్ నూతన కార్యవర్గం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో మాజీ డీసీసీ ఎం సుధాకర్‌బాబు, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, జాన్‌విల్సన్, చంద్రశేఖర్, జిల్లా మహిళా సేవాదళ్ అధ్యక్షురాలు ఎ.వెంకటలక్ష్మి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ బ్రతుకన్న, మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షుడు షేక్ ఖాజా హుస్సేన్, కొత్త పేట మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీటీఈ నిబంధనలు ఎత్తివేయాలి

ఆర్‌యూలో నిరసన తెలిపిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్



ఆర్‌యూలో రెక్టారుకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్), జనవరి 23: ఏఐసీటీఈ కొత్త నిబంధనలతో డిగ్రీ కళాశాలలు స్వయం ప్రతిపత్తి కోల్పోతాయని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు కునుమర్ల గుండారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యజమానులు నినాదాలు చూస్తూ నిరసన తెలిపారు. అనంతరం రెక్టార్ సీవీ కృష్ణారెడ్డికి ఓ వినతి పత్రం ఇచ్చి సమస్యను వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీకామ్, సీఏ, బీఎస్సీ కంప్యూటర్ కోర్సులు కూడా ఏఐసీటీఈ పరిధిలోకి వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట ఉన్నత విద్యామండలిలో ఉన్న డిగ్రీ కాలేజీ, యునివర్సిటీ స్వయం ప్రతిపత్తి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి మొదటి వారంలో 5 రాష్ట్రాల అసోసియేషన్ సభ్యులు డిల్లీలో ఏఐసీటీఈ చైర్మెన్‌ను కలిసి మాట్లాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే వారంలో ఏఐసీటీఈ నోటిఫికేషన్ పైన హైకోర్టులో కేసు రిజిస్టర్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ జెర్రిపోతుల రమణాజీ, గుర్రాల వెంకటరెడ్డి, చింతల విజయభాస్కరరెడ్డి, యాజమాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ సూపర్‌వైజర్ల వివరాలు పంపండి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 23: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సమగ్ర శిక్షలో గతంలో పనిచేసిన నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ల వివరాలను పంపాలని ఎస్ ఎస్ ఏ ఏపీసీ విజయ జ్యోతి కుమారి మంగళవారం తెలిపారు. మండల వనరుల కేంద్రంలో పని చేసిన వారి వివరాలను, విద్య అర్హత, సర్వీసు సర్టిఫికెట్ వంటి వివరాలను మండల విద్యాశాఖ అధికారులు పరిశీలించి, ఈ నెల 31 వ తేదీలోగా కర్నూలు జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు.

భారీగా పట్టుబడిన కర్ణాటక మద్యం

ఐదుగురి అరెస్టు.. మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ఆదోని రూరల్, జనవరి 23 : కర్ణాటక మద్యం తరలిస్తున్న ఐదుగురిని అదుపులో తీసుకున్నట్లు ఇస్బీ పోలీసులు తెలిపారు. హొళగుంద మండలం ఎల్లార్తికి చెందిన బోయ చంద్రశేఖర్, హెబ్బటంకు చెందిన ఈరప్ప, ఆస్పరి మండలం ములుగుందంకు చెందిన ఆది కేశవరెడ్డి, గార్లపెంటకు చెందిన సురేంద్ర, పెద్దకడుబూరుకు చెందిన కాళింగ మంగళవారం వేర్వేరుగా మూడు ద్విచక్ర వాహనాల్లో కర్ణాటక మద్యం తరలిస్తుండగా, మదిరె, నాగనాథనహళ్ళి శివార్లలో వీరిని అదుపులోకి తీసుకొని వీరి వద్ద నుంచి దాదాపు 1536 కర్ణాటక మద్యం ప్యాకెట్లతోపాటు మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ నిరంజన్ రెడ్డి, ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కర్ణాటక మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

12వ పీఆర్సీ కొలిక్కి వచ్చేనా?

- ఉద్యోగుల డిమాండ్లను పట్టించుకోని ప్రభుత్వం
- మధ్యంతర భృతి ఏమవుతుందో..
- పెండింగ్ బకాయిల మాటే లేదు
- పేరుకే ఉద్యోగుల ఈహెచ్‌ఎస్
- వైసీపీ పాలనపై ఉద్యోగుల అసహనం

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 23 : 12వ పీఆర్సీ అమలు సమస్య కొలిక్కి వచ్చేలా లేదు. దీని మీద ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు ఎప్పటి నుంచో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 12వ పీఆర్సీ ఫిట్మెంట్ చేసేలోపు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఉద్యోగులు కోరుతున్నారు. 11వ పీఆర్సీ విషయంలో వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అభ్యంతరకరమని అంటున్నారు. పైగా పెండింగ్ బకాయిల సొమ్మును ప్రభుత్వ పథకాలకు దారి మళ్లించింది. ప్రభుత్వం విధానం వల్ల ఉద్యోగుల ఆర్థికపరమైన సమస్యలు దీర్ఘకాలికంగా పరిష్కారం కావడం లేదు. రోజువారి అవసరాలకు అప్పులు చేస్తున్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవుల తదితర నగదును చెల్లించకుండా సంవత్సరాల తరబడి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఉద్యోగస్థులు అంటున్నారు. వారి ఖాతాలలో ఉండాల్సిన సొమ్ము కనపడటం లేదు. ప్రతి నెల మొదటి పని రోజున ఇవ్వాల్సిన జీతం 15 రోజుల తర్వాత ఇస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న బకాయిలు

2022 జనవరి నాటికి పీఆర్సీ డీఏ అరియర్లు రూ.7,382 కోట్లు, కొత్త డీఏ అరియర్లు రూ.4,884 కోట్లు, పీఎఫ్‌లోన్లు పార్ట్‌ఫైనల్ పేమెంట్లు సుమారుగా రూ.1000 కోట్లు, ఏపీజీఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లు రూ.330 కోట్లు, సరెండర్ లీవులు రూ.4,500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి విడుదల చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు కోరుతున్నారు.



కారుణ్య నియామకాలను పట్టించుకోని ప్రభుత్వం

సహజ, కరోన మరణాలు సంబంధించిన కుటుంబ సభ్యులలో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. గత మూడు సంవత్సరాల నుంచి వైసీపీ ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టడం లేదు. దీంతో ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాయి.

పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించాలి

రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ అమలుపై జూలై 12వ తేదీ 2023 సంవత్సరంలో విశ్రాంతి ఐఏఎస్ అధికారి అయిన మన్మోహన్ సింగ్‌ను నియమిస్తూ జీవో 68 ప్రభుత్వం విడుదల చేసింది. పీఆర్సీ ఫిట్మెంట్ చేసేలోపు ఆరు నెలల ముందు మధ్యంతర భృతిని అమలు చేయాలి. 11వ పీఆర్సీని రివర్స్ పీఆర్సీగా ఉద్యోగులు అభివర్ణించారు. సామాజిక భద్రత లేని సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. పాత పెన్షన్ అమలు చేస్తామని చెప్పిన సీఎం ఎన్నికల హామీని గుర్తు చేశారు. మాట మార్చి మడమ తిప్పి జీపీఎస్ అమలు చేయడం పట్ల ఉద్యోగులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే ఈహెచ్‌ఎస్

అనారోగ్యం బారిన పడిన ఉద్యోగులు హెల్త్‌కార్డులను తీసుకుని కార్పొరేట్, ప్రైవేటు హాస్పిటల్స్‌కి వెళితే హాస్పిటల్స్ యాజమాన్యాలు ఈహెచ్‌ఎస్ చికిత్స డబ్బులు రావని బహిరంగంగా చెప్పడం పలు విమర్శలకు తావిస్తోంది. ఉద్యోగుల హెల్త్ కార్డుకు ప్రయోజనం లేకుండా పోయిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అయినా ప్రతి ఉద్యోగి హెల్త్ కార్డుకు డబ్బులు కడుతునే ఉన్నారు. తమ డబ్బులు తీసుకుని వైద్యం చేయకపోవడం విడ్డూరంగా ఉందని వారు విమర్శిస్తున్నారు. చేతిలో డబ్బులు ఉంటే వైద్యం.. లేకపోతే అనారోగ్యం అనే పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది.

బకాయిలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే



రాష్ట్రంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నిర్దిష్ట సమయంలో ప్రభుత్వం ఆర్థిక బకాయిలను చెల్లించడం లేదు. 11వ పీఆర్సీ అరియర్స్ 5 డీఏలు, సీపీఎస్ ఉద్యోగులకు డీఏ 90 శాతం క్యాష్ రూపంలో పెండింగ్, సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ జమ, 3 సంవత్సరాలకు పైగా సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, సంవత్సరానికి పైగా మెడికల్ బిల్స్, 10 నెలలుగా పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇలా బకాయిలు దాదాపు రూ.30వేల కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. గత పీఆర్సీ చరిత్రల్లో ఎన్నడూ లేని విధంగా 11వ పీఆర్సీలో ప్రభుత్వం ఉద్యోగ వర్గానికి తీవ్ర నష్టం కలగజేసింది. పై నష్టాలు 12వ పీఆర్సీలో సరి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

-జి.హృదయరాజు, రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర సెక్రటరీ జనరల్, ఏపీజేఏసీ

చిత్తశుద్ధి లేని ప్రభుత్వం



రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు కార్మికులు పెన్షనర్లకు 12వ పీఆర్సీ ప్రకటనకే పరిమితమైంది. దీని అమలుకు సంబంధించిన కార్యాలయ సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించలేదు. ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వారికి చెల్లించాల్సిన బకాయిలను పూర్తి స్థాయిలో ఇంత వరకు చెల్లించలేదు. 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి. ప్రాథమిక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో.నెం.117ను వెంటనే రద్దు చేయాలి.

- గోకారి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగులను శత్రువులుగా చూడడం బాధాకరం



ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లను ప్రభుత్వం శత్రువులుగా చూస్తోంది. ఇది చాలా బాధాకరం. మాకు రావాల్సిన బకాయిలను సైతం ప్రభుత్వం దోపిడీ చేస్తుంది. దన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల పక్షాన ఉన్నదని చెప్పుకొనే ప్రభుత్వం మోసం చేస్తున్నది. సరెండర్ లీవులు చెల్లించాలి. ఏపీజీఎల్ఐసీ పెండింగ్స్ బకాయిలు విడుదల చేయాలి.

- వెంగళ్‌రెడ్డి, ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

చంద్రబాబుతోనే బీసీల సంక్షేమం

- జయహో బీసీ సభకు విశేష స్పందన
- పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత

ఓర్వకల్లు, జనవరి 23: రాష్ట్రంలోని అన్ని వర్గాలతో పాటు బీసీలను ఆదుకునేది టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత, టీడీపీ నంద్యాల పార్లమెంటు అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఓర్వకల్లులో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓర్వకల్లు బస్టాండు నుంచి రచ్చకట్ట వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సుంకులమ్మ, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో హుశేనాపురం నుంచి ఓర్వకల్లు వరకు భారీ ర్యాలీ బైకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం.. అన్న లక్ష్యంతో నందమూరి తారకరామారావు టీడీపీని ఏర్పాటు చేశారన్నారు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ సైకోగా మారి బీసీలను పట్టించుకోలేదన్నారు. బీసీలంతా ఏకమై 2024 ఎన్నికల్లో సైకో జగన్‌ను గద్దె దించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలన్న ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చిందన్నారు. చంద్రబాబు నాయుడు బీసీల సంక్షేమం కోసం కృషి చేశారని, మండలంలో ఉక్కు పరిశ్రమ, సోలార్, విమానాశ్రయం, ఆయుధాల పరిశ్రమ తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. జగన్ పాలనలో బీసీలను పూర్తిగా అణగదొక్కారని



సమావేశంలో మాట్లాడుతున్న గౌరు చరిత

ధ్వజమెత్తారు. ఎలాంటి అధికారాలు, విధులు లేకుండా బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధుల్లో రూ.75వేల కోట్లు దారి మళ్లించి అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షురాలు పార్వతమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, సుధాకర్‌రావు, మహబూబ్‌బాషా, రామగోవిందు, లక్ష్మీకాంతరెడ్డి, విజయుడు, అల్లాబాబు, అబ్దుల్లా, మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రా కదిలి రా బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పెందుర్థి వెంకటేష్

పత్తికొండ, జనవరి 23: పత్తికొండలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్వహించనున్న రా కదిలి రా బహిరంగ సభకు సంబంధించి ఏర్పాట్లను రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబుతో కలిసి పరిశీలించారు. ఆదోని రహదారిలో టీడీపీ నాయకుడు ప్రమోద్‌కుమార్ రెడ్డి 16 ఎకరాల వెంచర్‌లో బహిరంగ సభ ఏర్పాటుకు ఇప్పటికే స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ వేదిక, భోజనాలు, వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్ వంటి ఏర్పాట్లపై చర్చించి మ్యాప్ సిద్ధం చేశారు. ఈ సందర్భంగా కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ ఈనెల 25న పత్తికొండలో అధినేత చంద్రబాబు రా కదిలి రా ప్రోగ్రాం షెడ్యూల్ ఖరారు కాగా అనివార్య కారణాలతో ఈ కార్యక్రమం వాయిదా పడిందన్నారు. త్వరలో పార్టీ అధిష్ఠానం నుంచి షెడ్యూల్ తేదీ తెలుస్తుందని అన్నారు. రా కదిలి రా బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన కోసం టీం నిర్వాహక సభ్యులలో ఒకరైనా పెందుర్తి వెంకటేష్ పరిశీలనకు వచ్చిరూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారన్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి

ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ



కరపత్రాలను విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదోని, జనవరి 23 : జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ, సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, గత నెలలో జరిగిన రోడ్ సేఫ్టీ సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలలో భాగంగా ఆదోని పట్టణంలో పంజారాపోలు గోశాల సమీపంలో ఉన్న రోడ్డు మలుపు దగ్గర, నెట్టేకల్ క్రాస్ రోడ్ దగ్గర తీసుకోవలసిన జాగ్రత్తలు, స్పీడ్ బ్రేకర్లు, రోడ్డుపై రంగులు సూచనల గురించి ఆరా తీశారు. ఇంకా పెండిగ్‌లో ఉన్న వాటిని కూడా పూర్తి చేయాలని, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. వాహనదారుల భద్రత కోసం ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్కూల్ ఆటోలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తుంటే వాటిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం జాతీయ రహదారి వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీలు శివ, నారాయణస్వామి, సీతారామయ్య, ఆర్టీవో నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శిశిర దీప్తీ, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్, రఫి, పంచాయతీ రాజ్, ఈఈ వెంకట ప్రసాద్, పోలీసు, రెవెన్యూ, శాఖ అధికారులు పాల్గొన్నారు.

భర్తపై ఫిర్యాదు

ఆదోని రూరల్, జనవరి 23 : అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న భర్తపై భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆదోని మండలం చిన్నపెండేకల్లుకు చెందిన విజయలక్ష్మికి మూడు సంవత్సరాల క్రితం ఆదోనికి చెందిన జగదీష్‌తో వివాహమైంది. కొద్ది రోజులుగా భర్త తనను అదనపు కట్నం కోసం అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నాడని మంగళవారం తాలుక పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ ఎర్రిస్వామి తెలిపారు.

నేటి నుంచి షర్మిల పర్యటన

నంద్యాల టౌన్, జనవరి 23: పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఈనెల 24 నుంచి మూడు రోజుల పాటు నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గంలో విస్తృత పర్యటన చేపట్టనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహయాదవ్ మంగళవారం తెలిపారు. ఏఐసీసీ పార్లమెంట్ పరిశీలకులు బండి జక్కరయ్య సమక్షంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు పర్యటనలు చేపట్టనున్నట్లు చెప్పారు. 24వ తేదీన శ్రీశైలం, నందికొట్కూరు, 25న డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజక వర్గాలు, 26న నంద్యాల, పాణ్యం నియోజకవర్గాల్లో పర్యటిస్తారని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి నియోజక వర్గాల పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చెక్‌పోస్టు ఎంవీఐపై కేసు నమోదు

హోంగార్డు, డ్రైవర్‌తోపాటు మరో ఆరుగురికి రిమాండ్

కర్నూలు, జనవరి 23: పంచలింగాల చెక్‌పోస్టులో అనధికార నగదుతో చిక్కిన ఎంవీఐ సునీల్ కుమార్‌తో పాటు మరో ఏడుగురిపైన కేసులు నమోదు చేశారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. ఏసీబీ అధికారులు సోమవారం తెల్లవారుజామున పంచలింగాల సమీపంలో ఉన్న రవాణా శాఖ చెక్‌పోస్టులో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ ఆరుగురు ప్రైవేటు వ్యక్తులతోపాటు హోంగార్డు, డ్రైవర్ ఆధ్వర్యంలో ఎంవీఐ సునీల్ కుమార్ దగ్గర రూ.2.02 లక్షల అనధికార నగదు గుర్తించారు. అంతరాష్ట్ర సరిహద్దు ద్వారా వెళ్లే రవాణా వాహనాలన్నీ చెక్‌పోస్టుల్లో మామూళ్లు ఇస్తున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో వీరిపై ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వీరిపై కేసు నమోదు చేశారు. ఎంఈవై సునీల్ కుమార్, హోంగార్డు యూసుఫ్, డ్రైవర్ మధు, ప్రైవేటు వ్యక్తులైన మనోజ్ కుమార్ (శరీన్‌నగర్), రామచంద్రగౌడు (పంచలింగాల), అనిల్ (ధర్మపేట), రవికాంత్ (చిన్నమార్కెట్), ఆవుల భాస్కర్ (తిమ్మాపురం)లపై కేసు నమోదు చేశారు. వీరందరినీ మంగళవారం రాత్రి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వీరికి రిమాండ్ విధించింది.

ఆసుపత్రి సెక్యూరిటీ గార్డులపై దాడి

నంద్యాల క్రైం, జనవరి 23 : నంద్యాలలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం సెక్యూరిటీ గార్డులపై దుండగులు దాడి చేశారు. సోమవారం అర్ధరాత్రి రెండు వర్గాలు ఘర్షణపడి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. క్షతగాత్రులను పరామర్శించేందుకు పట్టణంలోని బైటిపేటకు చెందిన కొంత మంది యువకులు మద్యం తాగి ఆసుపత్రికి వచ్చారు. మంగళవారం ఆసుపత్రి ఆవరణలో ఉన్న సెక్యూరిటీ గార్డులపై బైటిపేటకు చెందిన యువకులు ఘర్షణకు దిగారు. సెక్యూరిటీ గార్డులైన సాయి, బాల ఆంజనేయులు, పెద్దన్న, కృష్ణపర్‌లపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై సెక్యూరిటీ గార్డులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.



ప్రభుత్వాసుపత్రి సెక్యూరిటీ గార్డుల నిరసన

దాడికి పాల్పడిన దుండగులను అరెస్టు చేయాలి

నంద్యాల ప్రభుత్వాసుపత్రి సెక్యూరిటీ గార్డులపై బైటిపేటకు చెందిన దుండగులు దాడి చేయడం దారుణమని, వారిని వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్, సెక్యూరిటీ గార్డులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వాసుపత్రిలో సెక్యూరిటీ గార్డుల పట్ల దాడులు కొనసాగడం బాధాకరమని అన్నారు.

బైరెడ్డి భవిష్యత్ కార్యాచరణపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

నందికొట్కూరు జనవరి 23: మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి భవిష్యత్ కార్యాచరణపై ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో కొత్తపల్లి, పాములపాడు మండలాల ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు గుర్తు చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధిలేక ప్రజలు ఇబ్బందలకు గురవుతున్నారని పేర్కొన్నారు. 20 సంవత్సరాల క్రితం జరిగిన అభివృద్దేనని, నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గ అభివృద్ధి పాలకులు గాలికి వదిలేశారని విమర్శించారు. భవిష్యత్తులో పూర్వ వైభవం తెచ్చేందుకు త్వరలో ఓ మంచి అవకాశం వస్తుందని, అందుకు నాయకులు అందరూ సహకరించాలని ఆయన సూచించిన్నట్లు తెలుస్తోంది.

మోడల్ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పాణ్యం, జనవరి 23 : మండలంలోని మోడల్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత నెల 3వ తేదీన జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో పాఠశాలకు చెందిన ఎం. జస్వంత్, కె. యశ్వంత్, కె.లాస్య ఎన్. నిఖిత, కె. పవిత్రబాయి, పి.కావ్యబాయి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధీర్‌యాదవ్, ఈశ్వరీకుమారి, అశ్విని పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ఆత్మకూరు, జనవరి 23: నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన దుండగులను అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.ఏసురత్నం, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బండిఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన 30మంది దుండగులు ఆసుపత్రిలోకి రోగులను పరామర్శించేందుకు వచ్చి సెక్యూరిటీ గార్డులపై దాడి చేయడం సరికాదని అన్నారు. ఈదాడిలో సాయి, కిష్టపర్, కోటి, పెద్దన్నలకు గాయాలయ్యాయని తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఏపీ రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏపీ రైతు సంఘం క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షులు రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఆవిష్కరించారు. ఏపీ రైతు సంఘం ద్వారా రైతుల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు వివరించారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ఆత్మకూరు, జనవరి 23: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కమతం శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఉమర్, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణుడు డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ఉపాధ్యాయులకు భవిష్యత్ అవసరాలకు దాచుకున్న భవిష్య నిధి, ఏపీజీఎల్ఐ నగదును ప్రభుత్వం తన అవసరాల కోసం వాడుకోవడం దుర్మార్గమని అన్నారు. అలాగే కరువు భత్యం బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు కలిపి దాదాపు రూ.20వేల కోట్ల రూపాయాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒకటో తేదీన జీతాలు చెల్లించిన దాఖలాల్లేవని, ప్రతినెలా జీతాలు ఆలస్యంగా చెల్లిస్తున్నారని వివరించారు. దీనివల్ల బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించలేక సిబిల్ స్కోర్ తగ్గిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. సంఘం నాయకులు అబ్దుల్‌వహీద్, జక్కం దాసు, రామాంజనేయులు, పెరుమాళ్ల దాసు, రాంప్రసాద్, అజయ్ కుమార్, వెంకటాద్రి నాయుడు, జాల రామమూర్తి, కమతం విధుభూషణ్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ అధికారులపై కలెక్టర్ ఫిర్యాదు చేస్తాం : బీజేపీ

ఆత్మకూరు, జనవరి 23: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపల్ అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ మైనార్టీ మహిళా మోర్చా జాతీయ సభ్యురాలు మోమిన్ షబాన తెలిపారు. మంగళవారం పట్టణంలోని గౌడ్‌సెంటర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి నిర్వహించారు. అయితే ఈసదస్సు గురించి పట్టణ ప్రజలకు, ఆయా శాఖల అధికారులకు సంబంధిత అధికారులు ముందస్తు సమాచారం లేకపోవడంతో కార్యక్రమానికి కొంతమంది పొదుపు సంఘాల లీడర్లు హాజరయ్యారు. దీనిపై బీజేపీ నాయకురాలు మోమిన్ షబాన స్పందిస్తూ మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలపై చాలామంది ప్రజలకు అవగాహన లేకపోవడంతో ఆయా పథకాలను లబ్ధి పొందలేకపోతున్నారని చెప్పారు. కనీసం ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు కూడా హాజరుకాకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.

నందీశ్వర స్వామికి విశేష పూజలు

శ్రీశైలం, జనవరి 23: శ్రీశైల క్షేత్రంలో మంగళవారం త్రయోదశి ఘడియలను పురస్కరించుకొని సాయంప్రదోషకాలంలో ఆలయములోని మల్లికార్జునస్వామికి, నందీశ్వరస్వామికి పరోక్షసేవగా పూజలు చేశారు. నందీశ్వరస్వామికి పంచామృతాలతోనూ, పలు ఫలోదకాలతో, కుంకుమోదకం, హరిద్రోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, మల్లికార్జున గుండంలోని శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించి అనంతరం అన్నాభిషేకం జరిపారు. అభిషేకానంతరం నందీశ్వరస్వామికి నూతన వస్త్రసమర్పణ, విశేష అర్చనలు, నానబెట్టిన శనగలను సమర్పించారు.

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం



పారుమంచాలలో టీడీపీ నాయకులు

జూపాడుబంగ్లా, జనవరి 23: పారుమంచాల గ్రామంలో టీడీపీ నాయకులు సోమవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం లో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రఎస్సీసెల్ ఆర్గనేజింగ్ కార్యదర్శి జయసూర్య పాల్గొని మాట్లాడారు. బాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ఇంటింటికి వెళ్లి వివరించారు. బాబు గెలిస్తేనే రాష్ట్రప్రజలకు భవిష్యత్తు ఉంటుందని, లేకపోతే రాష్ట్రం అదోగతి పట్టిస్తారని అన్నారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, శివరామిరెడ్డి, రమణారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రహంతుల్లా, మోహన్‌రెడ్డి, రామోహ్మన్‌రెడ్డి, సుధాకర్, శ్రీనివాసులు,రవికుమార్‌యాదవ్, నాగముని, నరసింహులు పాల్గొన్నారు.

యువతకు దిక్సూచి నారా లోకేశ్







నంద్యాలలో భూమా బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు, ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం చేస్తున్న ఏవీఆర్ ప్రసాద్ , కేక్ కటింగ్ చేసిన గోగిశెట్టి నరసింహారావు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు
- నంద్యాలలో అన్నదానం
- భూమా నివాసంలో కేక్ కట్ చేసి సంబరాలు
- నందికొట్కూరులో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ

నంద్యాల (నూనెపల్లె), జనవరి 23: రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పనలో, సంక్షేమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దిక్సూచిగా మారారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్ అన్నారు. నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా మంగళవారం నంద్యాల ప్రభుత్వానుపత్రి ఆవరణలో ఏవీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో యువతకు తీరని అన్యాయం జరిగిందన్నారు. నిరుపేదలకు ఉపాధి కల్పనలో, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వాకా శివశంకర్‌యాదవ్, నాయకులు అజ్మీర్, తిమ్మయ్య, లయన్స్ క్లబ్ సేవా ప్రగతి ప్రతినిధి పెసల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూమా బ్రహ్మానందరెడ్డి నివాసంలో...

నారా లోకేశ్ జన్మదిన వేడుకలను నంద్యాలలోని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి నివాసంలో ఘనంగా నిర్వహించారు. భూమా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందన్నారు. టీడీపీ యువ రథసారధిగా నారా లోకేశ్ దిగ్విజయంగా ముందుకు తీసుకెళ్తున్నారని అభినందనలు తెలిపారు. టీడీపీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

గోగిశెట్టి ఆధ్వర్యంలో వేడుకలు

నంద్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు ఆధ్వర్యంలో నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన కార్యాలయంలో టీడీపీ అభిమానులతో కలిసి గోగిశెట్టి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ నారా లోకేశ్ ఇలాంటి పుట్టిన రోజులు మరిన్ని జరుపుకోవాలని, రానున్న ఎన్నికల్లో జయకేతనం ఎగురవేసి వచ్చే యేడు అధికార పార్టీ నాయకుడి హోదాలో పుట్టిన రోజు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఆత్మకూరు : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచు కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, టీడీపీ మైనార్టీ విభాగం నాయకురాలు నాగూర్‌ఖాన్, కలీముల్లా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఆ పార్టీ నాయకులు ఆర్టీసీ రామకృష్ణ, అడ్వకేట్స్ వెంకటేశ్వర్లు, రవికుమార్, రామ్మూర్తి, ఇందిరేశ్వరం నబిరసూల్, పస్పీల్ మునా ఉన్నారు.

అలాగే రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ మోమిన్ అహ్మద్‌హుసేన్ ఆధ్వర్యంలో ఆత్మకూరులోని ఆయన స్వగృహంలో లోకేశ్ జన్మదిన వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఇస్మాయిల్, జబివుల్లా, ముస్తఫా, గౌస్‌మాలిక్, జాకీర్, ఉన్నారు.

పాములపాడు : తెలుగు యువత మండల అధ్యక్షులు ఇజమల్ల మధుక్రిష్ణ ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. టీడీపీ యువత ఆరె చంద్రశేఖర్‌రావు, శివ, ఉస్మాన్, ప్రదీప్, మద్దిలేటి, రమేశ్, గురునాథ్, వెంకటేష్, ప్రసాద్, శ్రీను, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఎర్రగూడూరులో టీడీపీ నాయకులు లింగేష్‌గౌడ్ కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహించారు.

వెలుగోడు : టీడీపీ మండల అధ్యక్షుడు అన్నారపు శేషిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులు మాజీ సర్పంచు కలాం, మొమిన్ రసూల్, మల్లయ్య, వెంకటేశ్రనాయక్, సయ్యద్, బాస్కరరెడ్డి, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గ అధికారప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, గిరీశ్వర్‌రెడ్డి, జయసూర్య, చిన్న వెంకటస్వామి, భాస్కర్‌రెడ్డి, జకీర్ హుస్సేన్, ముర్తుజావలి, షకీల్ అహ్మద్, లక్ష్మీకాంతరెడ్డి, బ్రహ్మానందంరెడ్డి, చిన్న నాగలక్ష్మయ్య, జమీల్, రసూల్, వేణు, గని, రాజన్న, కళాకర్, మహిళా నాయకులు మీనాక్షిదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

గడివేముల: బిలకలగూడురు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎస్ఏ రఫిక్, సుదర్శన్‌రెడ్డి, జయంత్‌రెడ్డి లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు.







పాములపాడు, ఆత్మకూరు, నందికొట్కూరు పట్టణాల్లో నారా లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు

నేర నంద్యాలగా మార్చిన ఘనత శిల్పాదే

- అభివృద్ధిపై బహిరంగ చర్చకు భూమా సవాల్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 23: నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో నంద్యాలను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి నేర నంద్యాలగా మార్చారని టీడీపీ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం నంద్యాలలోని భూమా బ్రహ్మానందరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ అభివృద్ధిని పక్కన పెట్టి నేరాలను ప్రోత్సహిస్తూ, నేరాలకు పాల్పడిన వారిని వెనుకేసుకు వస్తున్నారని ఆరోపించారు. ఇటీవలే పాండురంగాపురం సమీపంలోని శిల్పా వెంచర్‌లో దళిత బాలికపై అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటనపై ప్రజాప్రతినిధులు, పోలీసు శాఖ ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు. కానిస్టేబుల్ సురేంద్ర హత్య కేసులో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్‌ను స్థానిక ఎమ్మెల్యే వెనుకేసుకు రావడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. అభివృద్ధిని పక్కన పెట్టి నేరాలను ప్రోత్సహిస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు సామాజిక మాధ్యమాలలో గొప్పలు చెప్పకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే శిల్పా రవి అనుచరుడు చంద్రాయుడు అక్రమ మద్యాన్ని అమ్ముతూ పోలీసులకు అడ్డంగా దొరికాడని, అక్రమ మద్యం రవాణ ఎలా జరుగుతున్నదనే అంశంపై పోలీసులు దృష్టి సారించకపోవడం దారుణమని అన్నారు. నంద్యాల నియోజక వర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని శిల్పా రవికి భూమా బ్రహ్మానందరెడ్డి సవాల్ విసిరారు. టీడీపీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూమా

వైఎస్సార్ ఆసరా కింద ఖాతాల్లో డబ్బు జమ



లబ్ధిదారులకు జంబో చెక్కును అందజేస్తున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జనవరి 23: జిల్లాలోని వైఎస్సార్ ఆసరా 4వ విడత పథకం కింద డీఆర్డీఏ, మెప్మా పరిధిలోని 26,102 స్వయం సహాయక సంఘాలకు చెందిన 2,53,077 మహిళా లబ్ధిదారులకు రూ.167.41 కోట్లు జమ చేశామని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తున్న ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, మైనార్టీ సంక్షేమ అభివృద్ధి సలహాదారుడు హబీబుల్లా, రాష్ట్ర హస్తకళల డైరక్టర్ సునీతా అమృతరాజ్ వీక్షించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కును అందజేశారు.

రక్తదానం సామాజిక బాధ్యత : డీఎస్పీ



రక్తదాతలకు ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు, జనవరి 23: రక్తదానం సామాజిక బాధ్యతని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో మంది అభాగ్యులు సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. అలాంటి వారికి రక్తదాతలు తరలివచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆకాంక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైతే పోలీసుశాఖ తరుపున రక్తదానం చేసేందుకు తాము ఎప్పటికీ ముందుటామని వివరించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఆత్మకూరు సీఐ నాగభూషణ్, ఎస్సైలు కృష్ణమూర్తి, అశోక్, వెంకటశివ, డాక్టర్ రాయుడు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా ఉన్నారు.

కొలనుభారతి భక్తులకు సకల ఏర్పాట్లు

కొత్తపల్లి, జనవరి 22: వచ్చే నెల ఫిబ్రవరి 14వ తేదీ మాఘశుద్ధ పంచమి రోజు జరిగే కొలనుభారతి అమ్మవారి వసంత పంచమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి లోటు రానీవకుండా అన్ని వసతులు కల్పించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని కొలనుభారతి క్షేత్ర ప్రాంగణంలో ఆలయ ఈవో మోహన్ అధ్యక్షతన తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14న నిర్వహించే అమ్మవారి పుట్టినరోజు వేడుకల ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో ముందస్తు సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ఈ వేడుకలకు వేల సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో వారికి తాగునీరు, ప్రత్యేక క్యూలైన్లు, మహిళలకు తాత్కాలిక వస్త్ర మార్పిడి గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే ప్రత్యేక వైద్యశిబిరం క్షేత్ర ప్రాంగణంలో భక్తులకు చలువ పందిళ్లు, చారుఘోషిణి నదిని శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. అలాగే గిరిజన గూడెం నుంచి క్షేత్రం వరకు ప్రైవేటు వాహనాలకు అనుమతులు ఇవ్వకుండా ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని పోలీసు, ఆర్టీసీ అధికారులను తహసీల్దార్ కోరారు. విద్యుత్ అధికారులు క్షేత్ర శివారు ప్రాంతం నుంచి ఆలయం వరకు విద్యుత్ బల్బులు ఏర్పాటు చేసి నిరంతర సరఫరా చేయాలని కోరారు. అలాగే ఆ రోజు అమ్మవారికి వివిధ ప్రత్యేక అలంకరణతో పాటు ప్రత్యేక పూజాది క్రతువులు, శ్రీశైలం దేవస్థానం నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. చిన్నారుల అక్షరాభ్యాసం చేయించుకునే భక్తులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయించుకుని అందుకు తగ్గ పురోహితులను నియమించుకోవాలని ఈవోను ఆదేశించారు. ఎంపీడీవో మేరీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి, ఆర్ఐ జహంగీర్‌భాషా, వైద్యాధికారి విజయేంద్ర, ఆయా శాఖల అధికారులు, పురోహితులు పాల్గొన్నారు.



ఆయా శాఖల అధికారులతో తహసీల్దార్ సమీక్ష

నంద్యాల సెబ్ సీఐగా విశ్వనాథ్‌రెడ్డి

నంద్యాల క్రైం, జనవరి 23 : నంద్యాల సెబ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా జి.విశ్వనాథ్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా కడప జిల్లాలో సెబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ నంద్యాల సెబ్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ జి.వెంకటరాముడును జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు పాణ్యంలో బీసీ జయహో సభ

పాణ్యం, జనవరి 23 : స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం బీసీ జయహో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల బీసీ కన్వీనర్ నంద్యాల రవికుమార్ తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ జయహో సభలో బీసీల సంక్షేమ కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు. బీసీల అభివృద్ధి భవిష్యత్తు కార్యాచరణపై సభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగరమేష్ నాయకులు రాంమోహన్ నాయుడు, సుబ్బయ్య, సుధాకర్, సుభాన్, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు

పాణ్యం, జనవరి 23 : స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐఎఫ్‌బీ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏఐఎఫ్‌బీ నాయకులు వెంకటాద్రి, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, శోభారాణి, రాజు, ఉపేంద్ర, సుమలత, సుజాత పాల్గొన్నారు.

నేతాజీ సేవలు చిరస్మరణీయం

నంద్యాల (కల్చరల్) : నేతాజీ సుభాష్ చంద్రబోష్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో నేతాజీ జయంతి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

శివయ్య ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి

నంద్యాల (కల్చరల్), జనవరి 23: రాష్ట్రంలోని ప్రజలందరికీ శివయ్య ఆశీస్సులు ఉండాలని బీజేపీ నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. కాళికాంబ దేవస్థానంలో శివయ్యకు అభిషేకం, కాళికాంబ అమ్మవారికి బంగారు పూలతో అర్చన చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ ఆరవేటి వాసు అభిరుచి మధును శాలువా కప్పి సన్మానించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కశెట్టి చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అభిప్రాయ సేకరణలో పాల్గొనండి

నంద్యాల రూరల్, జనవరి 23 : ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి విద్యుత్ వినియోగదారులనుంచి అభిప్రాయ సేకరణ కోరుతోంది. ఈ మేరకు మంగళవారం ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ పేరిట స్థానిక విద్యుత్ కార్యాలయం పత్రికా ప్రకటన విడుదల చేసింది. సలహాలు, సూచనలు చేయదలుచుకున్న విద్యుత్ వినియోగదారులు ఈ నెల 29,30,31 తేదీలలో నంద్యాల పట్టణంలోని టెక్కెలో ఉన్న విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 10.30 నుండి 01.00 గంటల వరకు మధ్యాహ్నం 02.00 నుండి 04.30 గంటల వరకు జరిగే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని డీఈఈ ఆంథోని తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరు రూరల్, జనవరి 23: మండల పరిధిలోని నల్లకాలువ గ్రామ శివారులో నిర్వహిస్తున్న నాటుసారా స్థావరాలపై దాడులు చేసినట్లు సీఐ నాగభూషణ్, ఎస్ఐ నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్ సిబ్బంది నల్లకాలువ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో సోదాలు చేపట్టారు. అటవీ ప్రాంతంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి ఆ బట్టీవద్ద 12 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, అక్కడ ప్లాస్టిక్ డ్రమ్ములలో ఉన్న 800 లీటర్ల బెల్లపు ఊటను, నాటుసారాతయారీ సామాగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ నాగభూషణ్ మాట్లాడుతూ.. నాటుసారా తయారీ, రవాణాకు పాల్పడినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ వృత్తిని మానుకోని పక్షంలో పలుమార్లు కేసులు నమోదైన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.ఈ దాడులలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'పంట నమోదు తప్పనిసరి'

చాగలమర్రి, జనవరి 23: గ్రామాల్లో రైతులు రబీ సీజన్‌లో సాగుచేసిన వివిధ పంటలకు నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి టి.మోహన్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని శెట్టివీడు, ముత్యాలపాడు, పెద్దబోదనం ఆర్‌బీకేలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది చేసిన పంట నమోదు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ కూడా వేగవంతం చేయాలని సూచించారు. ఈక్రాప్ నమోదు చేసుకోని రైతులు చేయించుకోవాలని అన్నారు. మద్దతు ధరతో జొన్న కొనుగోలుకు రైతులు ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయశాఖ ఏడీ రామ్మోహన్‌రెడ్డి, ఏవో రంగనేతాజీ, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, జనవరి 23: మండలంలోని కదిరిపురం, కేపీ తండా గ్రామాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో న్యామతుల్ల మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతగల భోజనం, కోడిగుడ్లు పంపిణీ చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. అనంతరం ఎఫ్ఏ-3 పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల గ్రేడింగ్‌ను తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మల్లికార్జున, సీఆర్పీ ఖాశీం పాల్గొన్నారు.

నేలంపాడులో వైద్య పరీక్షలు

చాగలమర్రి, జనవరి 23: మండలంలోని నేలంపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. నంద్యాల శాంతిరామ్ వైద్యశాలకు చెందిన వైద్య నిపుణులు లోకేష్, సురేష్, చాగలమర్రి వైద్యులు ఇమ్రాన్ కలిసి వివిధ వైద్య పరీక్షలు చేశారు. 43 మందికి రక్తపూత పరీక్షలు చేశారు. 46 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, సీహెచ్‌వో రమణమ్మ, హెచ్ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, సీతారాములు, మనోహర్, శేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీకాంత్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'కులగణన సర్వే వేగవంతం చేయాలి'

చాగలమర్రి, జనవరి 23: గ్రామాల్లో కులగణన సర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో మహబూబ్‌దౌలా సూచించారు. మంగళవారం చాగలమర్రిలో చేస్తున్న కులగణన సర్వేను పరిశీలించారు. వారు మాట్లాడుతూ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులచే సర్వే చేయాలని అన్నారు. బయోమెట్రిక్ తప్పనిసరిగా చేయాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, వలంటీర్లు ఉన్నారు.

రుద్రవరం: మండలంలో 16 సచివాలయాల పరిధిలో కులగణన సర్వే చేయడంలో నిర్లక్ష్యం తగదని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని నరసాపురం, ఆలమూరు, చిన్నకంబలూరు గ్రామాల్లో కులగణన సర్వే పరిశీలించారు. కులగణన సర్వే వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న కులగణన సర్వే పకడ్బందిగా నిర్వహించాలని ఎంపీడీవో వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చాకరాజువేముల గ్రామంలో పంచాయతీ కార్యదర్శులకు, వలంటీర్లకు కులగణనపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లి, చాకరాజువేముల గ్రామాల్లో జరుగుతున్న కులగణనను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్

డోన్(రూరల్), జనవరి 23: డోన్ పట్టణం త్రివర్ణ కాలనికి చెందిన తెలుగు విజయ్‌కుమార్ ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఎన్ఎస్‌యుఐ కార్యాలయంలో జరిగిన కమిటీ ఎన్నిక ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు ఆధ్వర్యంలో జరిగింది.

ఘనంగా నారా లోకేశ్ జన్మదినం



బనగానపల్లెలో సంబరాలు చేసుకుంటున్న బీసీ దంపతులు

బనగానపల్లె, జనవరి 23: బనగానపల్లె పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీసీ దంపతులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాత పాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, బాస్కర్‌రెడ్డి, మౌళీశ్వరరెడ్డి, ఇస్మాయిల్‌ఖాన్, అహ్మద్‌హుస్సేన్, అల్తాఫ్‌హుస్సేన్, సలాం, కాశీంబాషా, గౌండాబాబు, బచ్చుభాస్కర్, మౌలాలి, యాగంటి పల్లె దస్తగిరి, భూషన్న, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. నాయకులు షేక్షావలి చౌదరి, జాకీరుల్లా బేగ్, రమేష్, మేకల నాగరాజు, తిరుమలేష్ చౌదరి, జావాజి వెంకటేశ్వర్లు, రవీంద్రనాయక్, రూబెన్, కౌన్సిలర్లు రామగోపాల్, రామ్మూర్తి, నంద్యాల మధు, వంశీకృష్ణ, టైలర్ రాముడు, శివ, శ్రీనివాసులు, జగదీష్, నాగరాజు, కానాల అంజి, సుమంత్ పాల్గొన్నారు.

అవుకు: అవుకు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్, దంతెల రమణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిక్కన్న, అరుణ్‌కుమార్‌నాయక్, వెంకటరమణనాయక్, తిరుమలనాయక్, శ్రీను, కిట్టయ్య, సాత్రిరాజు, షేక్షావలి, ఇస్మాయిల్ , అశోక్, హనీప్ తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: టీడీపీ కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు



డోన్‌లో బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న సుబ్బారెడ్డి, నాయకులు

మంగళవారం టీడీపీ మండల కన్వీనర్ మూలే రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నంద్యాల రామేశ్వరరెడ్డి, నంద్యాల నారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పెట్నికోట సత్య, బొట్టుస్వామి, చంద్ర, మద్దయ్య, ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి, టైలర్ వెంకటరాముడు, మాజీ సర్పంచ్ సీతారామయ్య, తలారి రమణ, ప్రసాద్, గోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బర్త్‌డే కేక్ కట్ చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ యువగళం పాదయాత్ర ద్వారా నారా లోకేశ్ వైసీపీ ప్రభుత్వం పై దండయాత్ర చేసి ప్రజలను చైతన్యవంతుల్ని చేశారన్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు, రాష్ట్ర ప్రజలను వైసీపీ అరాచకాల నుంచి కాపాడేందుకు నారా లోకేశ్ చేస్తున్న పోరాటానికి అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, గండికోట రామసుబ్బయ్య, యువ నాయకులు ధర్మవరం గౌతమ్‌రెడ్డి, భరత్ రెడ్డి, అబ్బిరెడ్డిపల్లె గోవిందు, కుమ్మరి సుధాకర్, చక్రపాణిగౌడు, ఎల్ఐసీ శ్రీరాములు, రాముడు, కమలాపురం రమేష్ పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి పంపిణీ చేసుకున్నారు.



ఆళ్లగడ్డలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి అఖిలప్రియ



కొలిమిగుండ్లలో..



ప్యాపిలిలో..

కార్యక్రమంలో నాయకులు చిన్నసుంకయ్య, రామ్మోహన్‌యాదవ్, అంకిరెడ్డి, రజనిరెడ్డి, చల్లా వీరాంజినేయులు, సుదర్శన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మాజీ మంత్రి అఖిలప్రియ ఆధ్వర్యంలో మంగళవారం ఆమె స్వగృహంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు నిర్వహించారు. నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆమె ఆకాంక్షించారు.

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం గ్రామంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. తాళ్లూరి రమేష్‌నాయుడు, కోయ పుల్లయ్యనాయుడు, మహబూబ్‌బాషా, కె.హర్షవర్ధన్, మారెళ్ల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



బేతంచెర్ల టీడీపీ కార్యాలయంలో..



అవుకులో...



దొర్నిపాడు: భాగ్యనగరంలో..

'మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు'



వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఆర్టీవో క్రాంతి కుమార్

డోన్(రూరల్), జనవరి 23: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై వాహన దారులకు సూచనలు చేశారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్స వాలను పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో వాహన చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు.

సభాస్థలం పరిశీలన

బేతంచెర్ల, జనవరి 23: బేతంచెర్ల-కర్నూలు రహదారిలో నూతనంగా నిర్మించిన ఐటీఐ కాలేజీ, ఎంఎస్ఎంఈ సెంటర్ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ దగ్గర 27వ తేదీన మంత్రి బుగ్గన చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభాస్థలాన్ని బేతంచెర్ల సీఐ ప్రియతమ్‌రెడ్డి, చైర్మన్ చలంరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి హాజరవుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, బీసీ రెసిడెన్షియల్ స్కూల్ దగ్గర బహిరంగ సభ ఏర్పాట్లను నగర పంచాయితీ చైర్మన్ సీహెచ్ చలంరెడ్డి, సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్‌లు సభా ఏర్పాట్లు స్థలం, వాహనాల పార్కింగ్ స్థలం పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ రుద్రవరం నారాయణ, భాస్కర్ రెడ్డి, డీఈ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ జెండాను ఎగురవేద్దాం: సుబ్బారెడ్డి



సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన ఓబులాపురం వైసీపీ కార్యకర్తలు

డోన్, జనవరి 23: డోన్ నియోజకవర్గంలో అందరం కలిసికట్టుగా పని చేసి టీడీపీ జెండాను ఎగురవేద్దామని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని ఓబులాపురం గ్రామంలో సుబ్బారెడ్డి సమక్షంలో వైసీపీకి చెందిన గొల్ల వెంకట్రాముడు, భాస్కర్, ప్రసాద్, శ్రీనివాసులు, రంగస్వామి, రమేష్, సూరితో పాటు మరో 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు ఏ కష్టమొచ్చినా, ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, టీడీపీ నాయకులు దేవరబండ వెంకట నారాయణ, అబ్బిరెడ్డిపల్లె గోవిందు, మల్లయ్య, మిద్దెపల్లి గోవిందు, సర్పంచ్ రామిరెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, ఓబులాపురం విష్ణు పాల్గొన్నారు.

● వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతను వంచించిందని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సుబ్బారెడ్డి సమక్షంలో యు.కొత్తపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సుధాకర్, రామాంజనేయులు, చంద్ర, జనార్దన్, అర్జున్, భాషా, నగూర్‌తో పాటు 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, డోన్ నియోజకవర్గ టీడీపీ సలహాదారుల కమిటీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ఎల్లారెడ్డి, రియాజ్, రమేష్, భాస్కర్, సునీల్, హరీష్ పాల్గొన్నారు.

'బీసీల హత్యలన్నీ వైసీపీవే'

సంజామల, జనవరి 23: జగన్ పాలనలో 74మంది బీసీలు వైసీపీ వారి చేతుల్లో దారుణ హత్యలకు గురయ్యారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం సంజామల వనంవెంకటేశ్వరస్వామి ఆలయంలో బీసీ జయహో కార్యక్రమం బీసీ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ బీసీ కులాల నాయకులు వై.నాగేశ్వరరావుయాదవ్, డాక్టర్ మల్లికార్జున, వలసల రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటైన బహిరంగ సభకు బీసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీసీ మాట్లాడుతూ బీసీల ఆశాజ్యోతి టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు అని బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమైందన్నారు. బీసీలంటూ సీఎం జగన్ బీసీల వన్ను విరుస్తున్నారంటూ విమర్శించారు. నాయకులు తులసిరెడ్డి, కోడూరు పెద్దపుల్లయ్య, మహేశ్‌యాదవ్, మల్కిహుసేని, తోకల మద్దిలేటి, అల్వ కొండ బాషా, పస్పుల మహమ్మద్, గిద్దలూరు మౌలాలి, సానెం రవి, మాధవ భూషన్న, టీడీపీ మండల ఇంచార్జి బత్తుల ప్రతాప్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, మూసాని చంద్రశేఖర్‌రెడ్డి, మాయలూరు పెద్దసుబ్బారెడ్డి, విష్ణుశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: యువత భవిష్యత్తును సైకో సీఎం జగన్ ప్రభుత్వం నట్టేట ముంచిందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. కొలిమిగుండ్ల మండలంలోని హనుమంతుగుండం, బి. ఉప్పలూరు, బీ.తాడిపత్రి



అభివాదం తెలుపుతున్న నాయకులు

గ్రామాల్లో బీసీ ఉదయం నుంచి సాయంత్రం వరకు బాబుష్యూరిటీ, భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. బీసీ మాట్లాడుతూ హనుమంతుగుండం గ్రామంలో 2014-19 మధ్య కాలంలో టీడీపీ హయంలో రూ.148లక్షలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రైతు రుణమాఫీ కింద రూ.41 లక్షలు రైతులకు అందించామన్నారు. హనుమంతుగుండం, బీఉప్పలూరు, బి.తాడిపత్రి గ్రామాలను అభివృద్ధి స్దపరుస్తామన్నారు. నాయకులు ఐవీ పక్కీరారెడ్డి, మూలే రామేశ్వర్‌రెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, హనుమంతుగుండం నాయకులు గొల్లరాజు, గోపాల్, వసీబ్ పెద్దరాజు, లక్ష్మయ్య బి.ఉప్పలూరు నాయకులు పొట్టిపాటి రాజు, రామ్మోహన్, రామయ్య, కుమ్మరి శివయ్య, జనసేన నాయకులు హాజీవలి, రాఘవేంద్ర, బీ.తాడిపత్రి నాయకులు రామానాయుడు, నాగేంద్ర, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సద్వినియోగం చేసుకోవాలి'

డోన్(రూరల్), జనవరి 23: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు, చిన్నమల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చెన్నకేశవులు సూచించారు. వెంకటనాయునిపల్లె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సమస్యలున్నవారిని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

సెబ్ సీఐ వర్దనాదేవి బాధ్యతల స్వీకరణ

కోవెలకుంట్ల, జనవరి 23: కోవెలకుంట్ల సెబ్ సీఐగా వర్దనాదేవి ఎస్ఐగా ఓబులేసు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కోవెల కుంట్ల సీఐగా పనిచేస్తున్న టర్కీ బాషా అనంతపురానికి, ఎస్ఐ రమేశ్ బాబు కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో చిత్తూరు జిల్లా నగరి సీఐగా పనిచేస్తున్న వర్దనాదేవి, తిరుపతిలో పనిచేస్తున్న ఎస్ఐ ఓబులేసు బదిలీపై వచ్చారు.

పంట కోత ప్రయోగం

డోన్(రూరల్), జనవరి 23: మండలంలోని కామగానిగుంట్ల గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహిం చారు. సురేష్‌కు చెందిన పొలంలో ఉల్లి పంట కోత ప్రయోగం ద్వారా 9 కిలోల 450 గ్రాముల దిగుబడి వచ్చినట్లు ఉద్యానశాఖ అధికారి కళ్యాణి తెలిపారు. అలాగే ఆవులదొడ్డి లో కూడా పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ మండల కోఆర్డినేటర్ అబ్దుల్లా, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతి ప్రదానం

చాగలమర్రి, జనవరి 23: చాగలమర్రిలోని పట్టాభి రామాలయంలో అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన రామాయణ ప్రశ్నావలి పోటీల్లో విజేతలకు మంగళవారం దాతలు నగదును అందజేశారు. ఈ పోటీల్లో నాగేశ్వరమ్మ మొదటి స్థానంలో రాణించినందుకు రూ.1,016 నగదును విశ్రాంత ప్రిన్సిపాల్ అందజేశారు. రెండో స్థానంలో వెంకట జశ్వంత్‌కు రూ.716, మూడవ స్థానంలో సురేష్‌బాబకు రూ.616, నాల్గొస్థానం భాగ్యలక్ష్మికి రూ.516 నగదును దాతలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మరో 35 మందికి ఆవోపా ఆధ్వర్యంలో ప్రత్యేక బహుమతులను అందజేశారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



చాగలమర్రిలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళి

చాగలమర్రి, జనవరి 23: చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి హెచ్ఎం కోటయ్య పూలమాల వేసి ఆయన సేవల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు, పీడీ దాదాపీర్ పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ స్వర్ణలతాదేవి ఆధ్వర్యలో నేతాజీ చంద్రబోస్ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అధ్యాపకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయకుమారి, సూర్యనారాయణరెడ్డి, కోటేశ్వరరావు, రామకృష్ణ, రవికుమార్, రామన్న, వరలక్ష్మి, నాగరాజారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల హెచ్ఎం



డోన్‌లో నివాళి అర్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

రాజయ్య ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నివాళి అర్పించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో వినియోగదారుల రక్షణ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వినియోగదారుల రక్షణ సంఘం తాలుకా అధ్యక్షులు ఏఈ నాగరాజు, సామాజిక ఆరోగ్య కార్యకర్త మహ్మద్ రఫి తదితరులు పాల్గొన్నారు.

వెండి గంట బహూకరణ

బేతంచెర్ల, జనవరి 23: మండలంలోని గూటుపల్లె సమీపంలోని కొండల నడుమ వెలసిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత పాలుట్ల రంగనాథ స్వామికి రూ.30వేలు విలువ చేసే 40 తులాల వెండి గంటను భక్తులు మంగళవారం విరాళంగా అందజేశారు. వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన చంద్రన్న, లక్ష్మీదేవి దంపతులు వెండి గంటను ఆలయ అర్చకుడు ఆచార్యులకు అందజేశారు.

రాములవారి గ్రామోత్సవం

ప్యాపిలి, జనవరి 23: పట్టణంలో మంగళవారం రాములవారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయోధ్య బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందుగా అంకలా పరమేశ్వరిదేవి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వీఆర్‌కు అవుకు ఎస్ఐ?

అవుకు, జనవరి 23: అవుకు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ విష్ణునారాయణను మంగళవారం ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపించినట్లు తెలిసింది. ఐదు నెలల క్రితం అవుకుకు బదిలీపై వచ్చారు. పలు కారణాల కారణంగా వీఆర్‌కు పంపినట్లు సమాచారం.

ఈవీఎంపై అవగాహన

రుద్రవరం, జనవరి 23: ఓటు హక్కు ప్రజలు ఎలా వినియోగించు కోవాలో ఈవీఎంలపై మంగళవారం అవగాహన నిర్వహించారు. కోటకొండ, చెంచుగూడెం, కొత్తూరు, శ్రీరంగాపురం, తుమ్మలకొట్టాల, దక్షిణకొట్టాల గ్రామాల్లో అవగాహన కల్పించినట్లు అధికారి నరసింహ తెలిపారు. వీఆర్వో గురుస్వామి, బూత్ లెవల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

బనగానపల్లె, జనవరి 23: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయ అభివృద్ధికి నంద్యాల పట్టణం మూలసాగరానికి చెందిన మేడం పెద్దవెంగళరెడ్డి మంగళవారం రూ.50వేలు నగదును విరాళంగా అందించారు. ఆలయ ఈవో రామానుజన్‌కు ఈ విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

బనగానపల్లె, జనవరి 23: మండలంలోని నందవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సూర్యకమల్ బేస్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో పాఠశాల హెచ్ఎం బయన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఈనెల 27 నుంచి 31వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో నిర్వహించే పోటీల్లో బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. అండర్ 14 విభాగంలో ఈపోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.